క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

రాజానగరం: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతతో పాటు, అనుబంధ గ్రంథాలపై మండలంలోని జి.యర్రంపాలెంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. మార్గశిర మాసం (ధనుర్మాసం)లో భగవారాధనలో ఏవిధంగా ఉండాలో వివరిస్తూ త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఈ ప్రచారం జరిగింది. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పీఎస్ఎన్ మూర్తి, విజయ్, లక్ష్మీనారాయణ, లోహిత, జైరామ్, జోష్, సూర్యకుమారి, శోభారాణి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నాగంపల్లిలో రేపు రెవెన్యూ సదస్సు

సీతానగరం: మండలంలోని నాగంపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. సోమవారం వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, రికార్డ్ వర్క్ కోసం మంగళవారం రెవెన్యూ సదస్సు నిలిపివేసినట్టు చెప్పారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా సెలవు అయినందున, గురువారం నాగంపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఫొటోగ్రాఫర్ అభిరామ్‌కు అమెరికా అవార్డు



అవార్డును అందుకుంటున్న అభిరామ్

రాజానగరం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఇమేజ్ కొలీగ్ సొసైటీ అమెరికా సహకారంతో నిర్వహించిన పోటీలలో మండలంలోని కొత్త తుంగపాడుకు చెందిన గొల్లపల్లి అభిరామ్ అమెరికా గౌరవ పురస్కారాన్ని అందుకున్నాడు. నాగార్జున యూనివర్సిటీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహనరావు చేతుల మీదుగా ఈ అవార్డును అభిరామ్ అందుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 28 మందిని ఎంపిక చేయగా, ఇందులో మన దేశానికి చెందిన 11 మంది ఉన్నారు, వారిలో అభిరామ్ ఒకరు కావడం విశేషం.


175 క్యూసెక్కుల సాగునీరు విడుదల



పుష్కర ఎత్తిపోతల పథకం

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం వద్ద ఉన్న తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 175 క్యూసెక్కుల సాగునీటిని మెట్టప్రాంత పొలాలకు విడుదల చేసినట్టు జల వనరుల శాఖ జేఈ సుమంత్ మంగళవారం తెలిపారు. పుష్కర–1 నుంచి ఒక మోటారు ద్వారా సాగునీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 13.5 మీటర్లు ఉందన్నారు. ఈ నెల 16 నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటి విడుదల నిలిపివేశామని తెలిపారు. గోదావరి నీటిమట్టం 14 మీటర్లు ఉంటే, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదల సాధ్యమవుతుందని వివరించారు. గోదావరి నీటిమట్టం తక్కువ ఉన్నందున ఈ నెల 16 నుంచి సాగునీటి విడుదల నిలిపివేశామని జేఈ సుమంత్ తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. మార్గశిర మాసం మంగళవారం సందర్భంగా భారీ ఎత్తున భక్తులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాస్కర్, సిబ్బంది ప్రసాద్, సత్తి బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆశల ఏడాదికి స్వాగత ఏర్పాట్లు

- ప్రారంభమైన న్యూ ఇయర్ సందడి
- మార్కెట్‌లో పండ్లు, బొకేలకు పెరిగిన డిమాండ్
- కేకుల తయారీలో నిమగ్నమైన బేకరీ వ్యాపారులు
- వినియోగదారుల అభిరుచులకు ప్రాధాన్యం
- వేడుకలకు సిద్ధమవుతున్న యువత



అనపర్తిలోని బేకరీలో తయారు చేస్తున్న కేకులు



బేకరీలో అమ్మకానికి సిద్ధంగా న్యూ ఇయర్ కేకులు

బిక్కవోలు: నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తుండటంతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. వేడుకలను ఘనంగా జరుపుకోడానికి అన్ని వర్గాల ప్రజలు ముందుస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో పలు రకాల పూలకు డిమాండ్ ఏర్పడింది. శుభాకాంక్షలు తెలియజేసేందుకు వినియోగించే బొకేలు మార్కెట్లో ఇప్పటికే రకరకాల డిజైన్లతో అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు కుటుంబ సభ్యులు ఏదైనా వేడుక జరుపుకోవాలంటే రకరకాల పిండి వంటలు తయారు చేసుకునేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. ఇప్పుడు వేడుక ఏదైనా కేకు ఉండాల్సిందే అన్నట్టుగా పరిస్థితి మారింది. చిన్నా, పెద్దా తారతమ్యాలు లేకుండా పెళ్లి రోజులకు సైతం కేక్ కట్ చేస్తున్నారు. దీంతో కేక్ తయారీదారులకు లాభాల పంట పండుతోంది. అన్నింటికీ ఒకేలా కేక్ తయారు చేసే పద్ధతికి వారు స్వస్తి పలికారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వివిధ ఆకారాల్లో సృజనాత్మకతకు పదును పెట్టి కేకులు తయారు చేస్తున్నారు. న్యూయర్ వేడుకలకు వివిధ రకాల ఆకృతుల్లో కేకులను తయారు చేసే పనిలో వ్యాపారులు నిమగ్నమయ్యారు. నెల రోజుల ముందుగానే కేకులకు ఆర్డర్లు రావడంతో వారికి చేతి నిండా పని దొరికింది. ఎగ్‌లేస్ కేకులూ అందుబాటులో ఉన్నాయని తయారీదారులు చెబుతున్నారు. ఇప్పటికే అనపర్తి నియోజకవర్గంలో ఉన్న దుకాణాల్లో సుమారు 6 వేల కేజీలకు పైగా కేకులు తయారుచేసి ఉంచారు.

రుచిలోనూ మేటి

ప్రస్తుతం కేకులు రుచిలోనూ మేటిగా మారాయి. వివిధ ఫ్లేవర్లలో అందుబాటులోకి వచ్చాయి. వెనిలా, బటర్‌స్కాచ్, పైనాపిల్, కస్టర్డ్ ఆపిల్ తదితర బ్రాండెడ్ కేకులకు వినియోగదారులు ఫిదా అవుతున్నారు. దీంతో పాటు కూల్ కేకులు అందుబాటులోకి వచ్చి వినియోగదారులతో ఆహా అనిపిస్తున్నాయి.

ట్రెండ్ మారింది



నేడు ప్రతి వేడుకలకు కేక్ కట్ చేయడం ట్రెండ్‌గా మారింది. గతంతో పోల్చుకుంటే ప్రజలు అభిరుచులు మారాయి. వారి ఇష్టానికి తగ్గట్టే కేకులను తయారు చేసి అందుబాటులో ఉంచుతున్నాం. కొనుగోలు దారుల అభిరుచి మేరకు కేకులు తయారు చేస్తున్నాం. ఎగ్‌లెస్ కేకులు ఈ ఏడాది తక్కువగా ఆర్డరు వచ్చాయి. ఇంకా మరిన్ని ఆర్డర్లు వచ్చే అవకాశం ఉంది.

కర్రి శ్రీనివాస్‌రెడ్డి, బేకరీ యజమాని, అనపర్తి.

సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి

అనపర్తి సీఐ సుమంత్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ సుమంత్

పెదపూడి: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని అనపర్తి సీఐ సుమంత్ అన్నారు. అనపర్తి జీబీఆర్ కాలేజీలో సైబర్ నేరాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సులభంగా నగదు సంపాదించాలనే దురుద్దేశంతో సైబర్ నేరాలకు ఎక్కువగా పాల్పడుతున్నారన్నారు. దీంతో ఆర్థిక భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. సైబర్ క్రైమ్ పోలీసు అధికారులు మహేష్, సురేష్‌లు సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసరమైన లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఎస్సై శ్రీను నాయక్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌పీ.అబ్బాయిరెడ్డి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పీఆర్ఎల్‌స్వామి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు సీహెచ్ ఆనందరావు, పీవీ.వెంకటేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేలో అలసత్వం వద్దు

ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి



పెదపూడి: స్వామిత్వ సర్వేను సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది నిబంధనల ప్రకారం చేపట్టాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి యజమానికి స్వామిత్వ హక్కుపత్రం ఇవ్వాల్సి ఉందన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ కల్పించుటకు అధికారులు కృషి చేయాలన్నారు. హౌస్‌హోల్డ్ సర్వేలో మిగిలిన సిటిజన్స్‌ను పరిశీలించి సర్వే చేయాల్సి ఉందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థల(ఎంఎస్ఎంఈ) సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. సచివాలయ అధికారులు, సిబ్బంది విధులకు వచ్చే సమయంలో హెచ్ఆర్ఎంఎస్‌లో ఫేస్ అటెండెన్స్ వేయాలని, సాయంత్రం విధుల నుంచి వెళ్లే సమయంలో మరల అటెండెన్స్ వేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారి జీతాలకు అటెండెన్స్ లింక్ చేస్తారని హెచ్చరించారు. క్లోరినేషన్ చేసిన సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు యాళ్ల ఉమా మహేశ్వరరావు, మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్, నాగేంద్ర, సుంకర వీరస్వామి, తరుణ్, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బలభద్రపురంలో వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విష్వక్సేన వాహనంలో ఊరేగుతున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో కొలువైన, తూర్పు తిరుమలగా పేరు గాంచిన శ్రీ దేవీ భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. సుమారు 15 మంది రుత్వికులు దీక్షాధారణ, ధ్వజారోహణం, అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి ఊరేగింపులో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం



వైఎస్సార్ సీపీ అనపర్తి కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ఎన్నికల హామీలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విద్యుత్ చార్జీల పెంపుపై ఈ నెల 27న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని బూటకపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజలపై పెద్ద ఎత్తున విద్యుత్ భారం మోపారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి జగన్ రైతులకు 9 గంటల నాణ్యమైన వ్యవసాయ విద్యుత్‌ను ఉచితంగా అందించారన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోగా, 7 గంటలకు మాత్రమే వ్యవసాయ విద్యుత్‌ను పరిమితం చేశారని విమర్శించారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు చుక్కలు చూపిస్తోందన్నారు. 27న జరిగే ధర్నా సందర్భంగా అనపర్తిలో ఉదయం 9 గంటలకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకోవాలన్నారు. అక్కడ నుంచి దుప్పలపూడిలో విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకొని అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు.

కార్యక్రమంలో అనపర్తి మండల పార్టీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రంగంపేట మండల పార్టీ ఇన్‌చార్జి నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, పొలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ సభ్యులు కర్రి చినవెంకటరెడ్డి, బందారు శ్రీను, తుమ్మా రాజేశ్వరి, సత్తిబాబు, పార్టీ నాయకులు తేతలి కళావతి, కాశీడేవిడ్‌రాజ్, పడాల శ్రీను, నూతిక ప్రవీణ్, తేతలి చినవెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రిని కలిసిన జిల్లా ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం నాయకులు

బిక్కవోలు: ఆయిల్ పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలని కోరుతూ జిల్లా ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం సభ్యులు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఆయిల్ పామ్ రైతు సంఘ అధ్యక్షుడు పెండ్యాల బుజ్జిబాబు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సంవత్సరాన్ని నవంబరు నుంచి అక్టోబర్ వరకు గుర్తించాలన్నారు. తెలంగాణతో సమానంగా ఆయిల్ పామ్ రైతులకు గెలల ధర ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆయిల్ పామ్ సంఘం కార్యదర్శి మైరెడ్డి గంగాధరం, మాజీ చైర్మన్ ముళ్లపూడి మురళి తదితరులు ఉన్నారు.

గొయ్యి పూడ్చరూ..!



ఇనుగంటివారిపేటలో పంచాయతీ సిబ్బంది వదిలేసిన గొయ్యి

సీతానగరం: ఇనుగంటివారిపేట ఎస్సీపేటలో పంచాయతీ సిబ్బంది తవ్వి వదిలేసిన గొయ్యిని తక్షణమే పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. రెండు వారాల క్రితం పంచాయతీ సిబ్బంది మంచి నీటి పైపులైన్ మరమ్మతు కోసం గొయ్యి తవ్వారు. అయితే అక్కడ పైపులైన్ లేకపోవడంతో గొయ్యిని అలాగే వదిలేశారు. ఈ గొయ్యిని పూడ్చాలని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు చెప్పారు. చిన్న పిల్లలు గొయ్యిలో పడి గాయపడుతున్నారని, అలాగే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు తక్షణం స్పందించి, ఈ గొయ్యిని పూడ్పించాలని స్థానికులు కోరుతున్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి, సంతోషిమాత ఆలయాలకు రూ.45 వేలు విరాళం సమకూరింది. మంగళవారం బలభద్రపురం గ్రామానికి చెందిన దివంగత మేడపాటి సుబ్బారెడ్డి, కుసుమ కుమారి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు మేడపాటి వెంకట నారాయణరెడ్డి దంపతులు రూ. 25,116 విరాళంగా అందించారు. వారి మనుమడు అమెరికాకు చెందిన మేడపాటి సుభాష్‌రెడ్డి దంపతులు మరో రూ.10,116 అందించారు. పడాల గంగిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య గంగాభవాని, రాజమహేంద్రవరానికి చెందిన ఆమె కుమార్తె ఇందిరా స్నేహలు రూ.10,116 విరాళంగా అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎన్‌సీసీ నావెల్ యూనిట్ ప్రారంభం



జి.మామిడాడ పాఠశాలలో ఎన్‌సీసీ నావెల్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న లెఫ్టినెంట్ కమాండింగ్ అధికారి అక్షయ్ అరుణ్

పెదపూడి: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఎన్‌సీసీ కోర్సు ఉపయోగపడుతుందని కాకినాడలో ఎన్‌సీసీ నావెల్ యూనిట్‌కు చెందిన లెఫ్టినెంట్ కమాండింగ్ అధికారి సీడీఆర్ అక్షయ్ అరుణ్ అన్నారు. జి.మామిడాడ గమ్యం స్కూల్లో మంగళవారం ఎన్‌సీసీ నావెల్ యూనిట్ విభాగాన్ని ఆయన ఎంఈఓ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. స్కూల్ కరస్పాండెంట్ కర్రి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అక్షయ అరుణ్ మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం విద్యార్థులకు గొప్ప అవకాశమన్నారు. ఇది వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వర రాజు, గమ్యం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్‌వీ కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ ప్రతినిధులు కర్రి సత్యనారాయణరెడ్డి (ట్రాక్టర్ సత్తిబాబు), కర్రి సుబ్బిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళపై కర్రతో దాడి

సీతానగరం: రాపాకకు చెందిన ఏడిద కనకమహాలక్ష్మిని కర్రతో కొట్టి గాయపర్చిన శారద హైమావతిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి రామ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, పదేళ్ల క్రితం హైమావతిని ఆమె భర్త వదిలేశాడు. తన భర్త వదిలేయడానికి కనకమహాలక్ష్మి, ఆమె కుమార్తె కారణమని హైమావతి కోపం పెంచుకుంది. సోమవారం హైమావతి కర్రతో కనక మహాలక్ష్మిపై దాడి చేసింది. గాయపడిన కనకమహాలక్ష్మిని స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతోంది. ఆస్పత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రెండిళ్లలో వెండి వస్తువుల చోరీ

కంబాలచెరువు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు చోట్ల కేజీ వెండి వస్తువులు చోరీకి గురైనట్టు మంగళవారం కేసులు నమోదయ్యాయి. సీతంపేటకు చెందిన దుర్గాదేవి ఈ నెల 10న ఇంటికి తాళం వేసి, పైఅంతస్తులో అత్త వద్ద నిద్రించేందుకు వెళ్లింది. మర్నాడు ఉదయం చూసేసరికి బీరువాలో 250 గ్రాముల వెండి వస్తువులు మాయమయ్యాయి. అలాగే రంగ్రీజుపేటకు చెందిన గణేష్‌కుమార్ ఈ నెల 7న కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లాడు. ఈ నెల 23న తిరిగిరాగా, బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో 750 గ్రాముల వెండి వస్తువులు చోరీ అయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ నుంచి తూర్పుగోదావరి జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు సిద్ధం చేశారు. జనవరి 9 నుంచి 13 వరకు తెలంగాణ నుంచి జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం ఆర్టీసీ డిపోల నుంచి జిల్లాకు ప్రత్యేక సర్వీసులను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 88 ప్రత్యేక సర్వీసులు హైదరాబాద్ నుంచి ప్రయాణించనున్నాయి. రాజమహేంద్రవరం డిపో 47, గోకవరం డిపో 16, కొవ్వూరు డిపో 16, నిడదవోలు 9 సర్వీసులను కేటాయించారు. ఆయా సర్వీసుల్లో అధిక రుసుము లేకుండా, సాధారణ టిక్కెట్ ధర వసూలు చేస్తామని డీపీటీఓ షర్మిల అశోక మంగళవారం ఇక్కడ తెలిపారు. సంక్రాంతి అనంతరం జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తిరుగు ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులను సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేక బస్సులతో పాటు, ప్రయాణికుల రద్దీ మేరకు మరిన్ని బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు



పెదపూడి బేతేలు చర్చిలో క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అతిథులు, పాస్టర్లు

మధురపూడి: క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రీస్తు జన్మించిన సమయానికి అనుగుణంగా రాత్రంతా జాగరణతో ప్రార్థనలు చేశారు. కోరుకొండ ఎస్సార్‌నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్ మాణిక్యం ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలతో సందడి ఏర్పడింది. మండలంలో లూథరన్, పెంతుకోస్తు తదితర మిషనరీల్లో క్రైస్తవులు క్రీస్తు జన్మదిన వేడుకలను నిర్వహించారు. పాస్టర్ మాణిక్యం మాట్లాడుతూ,, క్రైస్తవుల ఆరాధ్య దైవం ఏసుక్రీస్తు జననం ద్వారా మానవాళికి పాప విముక్తి జరిగిందన్నారు. క్రిస్మస్ ద్వారా ప్రేమ, కరుణను అలవర్చుకోవాలన్నారు. మానవాళి కోసం పరలోకం నుంచి భూమిపైకి వచ్చిన క్రీస్తు బోధనలను అనుసరించాలన్నారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన పశువుల పాకలో తల్లి మరియమ్మ, బాలఏసు, ఇతర బొమ్మలు ఆకట్టుకున్నాయి. మండలంలోని లూథరన్, పెంతుకోస్తు, తదితర మిషనరీలకు చెందిన చర్చిల్లో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ అలంకరణలు, రంగులతో తీర్చిదిద్దారు.

ఇలాఉండగా మండలంలోని వివిధ సంఘాల క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. కోరుకొండ, బూరుగుపూడి, దోసకాయలపల్లి, గాడాల, నిడిగట్ల, కోటికేశవరం, గాదరాడ తదితర గ్రామాల్లో వేడుకలు జరుగుతాయి.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

రాజానగరం: స్థానిక దివ్య విద్యా సంస్థలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ని కట్ చేసి, అందరికీ పంచారు. స్కూల్ యాజమాన్యంతో పాటు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేతేలు చర్చిలో ఘనంగా వేడుకలు

పెదపూడి: లోక రక్షణకై యేసుక్రీస్తు జన్మించారని పాస్టర్లు రెవరెండ్ ప్రభావ్ కుమార్, జీవానందం అన్నారు. పెదపూడి గ్రామంలో బేతేలు ప్రార్థనా మందిరంలో స్థానిక పాస్టర్ బిషప్ చుక్కా సామ్యూల్‌రాజ్, దేవకుమారి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రభావ్ కుమార జీవానందం, శామ్యూల్‌రాజ్, స్థానిక పాస్టర్లు దేవ వరప్రసాద్, జాన్‌రత్నంలు కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. చిన్నారులు, యువత, పెద్దలకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిషప్ శామ్యూల్‌రాజ్ మాట్లాడుతూ క్రీస్తు జన్మదినం మానవాళికి ఒక పండుగ దినంగా అభివర్ణించారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమైనవని అన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చర్చియాత్ తదితరులు పాల్గొన్నారు.



పెదపూడిలో కొవ్వొత్తులు చేత పట్టి కీర్తనలు పాడుతున్న భక్తులు



విద్యుద్దీపాలంకరణలో కోరుకొండలోని ఆర్‌సీఎం చర్చి